క్లుప్తంగా

ఘనంగా బీసీనేత కృష్ణయ్య జన్మదిన వేడుకలు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న మల్లేశ్ యాదవ్ తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు శుక్రవారం నగరంలోని బీసీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఫ్రంట్ చైర్మన్ జి.మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో కృష్ణయ్యను శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, కృష్ణ, భరత్, సత్యం, లాల్‌కృష్ణ, వెంకటేశ్, నందగోపాల్, రాజేందర్, అనంతయ్య, పృథ్విగౌడ్, రమాదేవి, లక్ష్మి, నిఖిల్ ఉన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్.. కృష్ణయ్యకు కలిసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీని మరింత బలోపేతం చేయండి



దండుమైలారంలో.. బీజేపీ సభ్యత్వ నమోదు

ఇబ్రహీంపట్నం: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోరెడ్డి నర్సింహ్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం దండుమైలారంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యధిక సభ్యత్వాలను నమోదు చేసి, పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు ప్రతాప్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, సభ్యత్వ నమోదు కన్వీనర్ రమణారెడ్డి, గ్రామ బూత్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దిలీప్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, సాయికుమార్ చారి, కృష్ణ, రవి, శ్రవణ్ పాల్గొన్నారు.

బలమైన పార్టీ

శక్తివంతమైన భారత్‌కు బలమైన పార్టీ ఎంతో అవసరమని, అందుకు పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల భాస్కర్, సభ్యత్వ నమోదు కన్వీనర్ విజయ్‌కుమార్ అన్నారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన పట్నంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, సత్యకుమార్, గణేశ్, శ్రీశైలం, అశోక్, రాఘవేందర్, మహేందర్, అనిల్, సంతోష్, శశిధర్, అభిషేక్, చంద్రశేఖర్, నిఖిల్, మహేశ్ ఉన్నారు.

సర్వే అనంతరం హద్దులు

తుర్కయంజాల్: ప్రభుత్వ సర్వే నంబర్ 212ను పూర్తిగా సర్వేచేసి, హద్దులు నిర్ణయిస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి తెలిపారు. శ్మశాన వాటికకు గతంలో కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతుందన్న ఫిర్యాదు మేరకు ఆయన శుక్రవారం.. మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, తదితర అధికారులతో కలిసి భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో సర్వే నిర్వహిస్తామని, సర్వే ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణకుమారి ఉన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఇబ్రహీంపట్నం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఇబ్రహీంపట్నం మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిసాయి. స్థానిక గురుకుల విద్యాపీఠ్‌లో అండర్-14, 17 విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విన్నర్, రన్నర్ జట్లను జోనల్ లెవెల్ టోర్నమెంట్‌కు ఎంపిక చేయనున్నారు. ఈ సందర్భంగా విజేతలకు మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ఎం యూనియన్ ట్రెజరర్ రుద్రాణి, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, గేమ్స్ జోనల్ సెక్రటరీ సుశీల, పీడీలు విజేందర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: హౌస్ అరెస్టు అయిన నాయకులు



మాడ్గుల: పోలీసుల అదుపులో..



యాచారం: పోలీసుల అదుపులో గులాబీ నేతలు

బాబు డైరెక్షన్‌లోనే దాడులు

- వికృత రాజకీయాలకు పాల్పడుతున్న సీఎం రేవంత్
- హరీశ్ అరెస్టును ఖండిస్తూ.. బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు
- జోరుగా నిరసనలు.. అడ్డుకున్న పోలీసులు



కడ్తాల్: పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు డైరెక్షన్‌లో.. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వికృత రాజకీయాలకు తెరలేపారని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన రేవంత్.. పాలన అనుభవం లేక, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడు ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులపై దాడులు జరగలేదని గుర్తు చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్టును ఖండిస్తూ.. శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై నిరసన తెలిపేందుకు వెళ్తుండగా, పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకు, గులాబీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఠాణా ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. పలువురు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి సీఎం రేవంత్‌రెడ్డి ప్లానేనని మండిపడ్డారు. ఒక ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరుగుతుంటే రక్షణ కల్పించాల్సిన పోలీస్ వ్యవస్థ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, రంగయ్య, వీరయ్య, ప్రియారమేశ్, మాజీ సర్పంచ్‌లు హరిచంద్, యాదయ్య, నర్సింహగౌడ్, లోకేశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌ది అరాచక పాలన



పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

మంచాల: రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగుతుందని బీఆర్ఎస్ మంచాల మండల అధ్యక్షుడు రమేష్ ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్, ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా.. నిరసన కార్యక్రమాలకు వెళ్తున్నారన్న సమాచారంతో పోలీసులు గులాబీ శ్రేణులను ముందస్తు అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అరాచక పాలన సాగుతుందని విమర్శించారు. ప్రజా సంక్షేమం గాలికి వదిలేసి, మోస పూరిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడమే కాకుండా.. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియంత పాలన



పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి నిరసనగా.. ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఇంటి ముట్టడికి బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో.. ఆ పార్టీ పట్నం నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు జగదీశ్వర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రావు మాట్లాడారు. అక్రమ అరెస్టులు తమ పార్టీకి కొత్తకాదని, అధికార పార్టీ నేతలు ఎంత అణచివేయాలని చూస్తే.. ఉప్పెనలా లేచి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలన ముసుగులో సీఎం రేవంత్ నియంత పాలన కొనసాగిస్తున్నాడని విమర్శించారు.

ముందుస్తు అరెస్టు

యాచారం: ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో కౌశిక్‌రెడ్డికి మద్దతుగా నిరసనలు వ్యక్తం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు చిన్నోళ్ల యాదయ్య, మారోజ్ శ్రీనువాస్, ఖాజా తదితరులు వెళ్తున్నారన్న సమాచారంతో పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే ప్రతిపక్ష నేతలపై దాడులు చేయిస్తుందని ఆరోపించారు.

నేతల హౌస్ అరెస్టు

ఆమనగల్లు: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి నిరసనగా.. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు వెళ్లడానికి సిద్ధమైన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, పార్టీ రైతు విభాగం నాయకుడు వెంకట్‌రెడ్డిలను ఏఎస్ఐ యాదయ్య ఆధ్వర్యంలో హౌస్ అరెస్టు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అబ్దుల్లాపూర్‌మెట్: ఫీడర్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దఅంబర్‌పేట పరిధి 33/11కేవీ, తట్టిఅన్నారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ లక్ష్మీగణపతి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్ 1-2, నవోదయ ఎన్‌క్లేవ్, శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలు, లక్ష్మీ గణపతి కాలనీ, జ్యోతిపురం, అన్నవరం సత్యనారాయణ కాలనీ, పల్లవి ఇంజినీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాలు, సూర్యమెడోస్, రాఘవేంద్ర కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ పేర్కొన్నారు. అదేవిధంగా మదర్ డెయిరీ సబ్‌స్టేషన్ పరిధి గణేశ్ నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు గణేశ్ నగర్, వేంకటేశ్వర కాలనీ, రవిశంకర్ కాలనీ, శివశంకర్ కాలనీ, మన్నాని కాలనీ, కుంట్లూరు పాత గ్రామం పరిసర ప్రాంతాలు, సర్వే నంబర్ 100, 99, 78లలోని కాలనీలు, శ్రీపాద నగర్, బలహీన వర్గాల కాలనీ, ప్రజయ్ గుల్మోహర్ కాలనీ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వెల్లడించారు.

డ్రోన్లపై నిఘా పెట్టండి

యాచారం: రాత్రి పూట ఆకాశంలో చక్కర్లు కొడుతున్న డ్రోన్లపై నిఘా పెట్టి, నిగ్గుతేల్చాలని నక్కర్తమేడిపల్లి గ్రామస్తులు శుక్రవారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పలు గ్రామాల మీదుగా రాత్రి 10 గంటల తర్వాత డ్రోన్లు తిరగడంతో ప్రజల్లో భయాందోళన నెలకొందని, నాలుగైదు రోజులుగా చింతపట్ల, మొండిగౌరెల్లి, మాల్, యాచారం, మల్కీజ్‌గూడ, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లో గాల్లో డ్రోన్లు తిరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో గ్రామస్తుల్లో భయాందోళనలు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎక్కడి నుంచి అవి వస్తున్నాయి, ఎవరు వాటిని తిప్పుతున్నారో కనిపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు గణేశ్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి

ఓటర్లకు ఎంపీడీఓల సూచన



ఆమనగల్లు: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ కుసుమమాధురి

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు: ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు మండల పరిధి గ్రామ పంచాయతీల నోటీసు బోర్డుల్లో ఓటర్ జాబితాను శుక్రవారం అధికారులు ప్రదర్శించారు. పంచాయతీ వార్డుల వారీగా ఓటర్ల విభజన, ఒకే కుటుంబంలోని వారందరినీ ఒకే వార్డులోకి చేర్చడం, చనిపోయిన వారి పేర్లను తొలగించడం తదితర మార్పులు, చేర్పులు ప్రస్తుత జాబితాలో పొందుపరిచారు. దీనిపై అభ్యంతరాలుంటే అధికారులకు ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19వ తేదీలోగా తెలపాలని పట్నం ఎంపీడీఓ వెంకటమ్మ, ఆమనగల్లు ఎంపీడీ కుసుమమాధురి తెలిపారు.

మంచాలలో..

మంచాల: ఓటరు జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తెలపాలని ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. మంచాల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం అక్కడ ప్రదర్శించిన ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు లిస్టును అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. లిస్టులో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ నెల 19లోపు తెలపాలని సూచించారు. అనంతరం సరిచేసి, నెలాఖరుకు తుది జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కడ్తాల్: గాంధీనగర్ గణేశ్ మండపం వద్ద పూజలు చేస్తున్న సీఐ, నాయకులు



ఇబ్రహీంపట్నం: నిమజ్జనానికి తరలుతున్న గణపతి



కడ్తాల్: ఫ్రెండ్స్ యూత్ వినాయక మండపం వద్ద భక్తుల పూజలు

ఘనంగా గణపతికి పూజలు

చవితి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఏడో రోజైన శుక్రవారం భక్తజనం.. లంబోదరులకు ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జన వేడుకల సందర్భంగా పలు ప్రాంతాల్లో వినాయకుడి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. భక్తులు వేలం పాటలో పాల్గొని మహాప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. అనంతరం ఊరేగింపుగా.. శివపుత్రుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. –సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: అన్నదానం ప్రారంభిస్తున్న సీఐ శివప్రసాద్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి



యాచారం: సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న పార్టీ శ్రేణులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

'సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తీరని లోటు. బడుగు బలహీన వర్గాల కోసం రాజీలేని పోరాటం చేసిన మహనీయుడు. మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా పార్లమెంటులో గళం విప్పిన నాయకుడు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి' అని ఆ పార్టీ నేతలు అన్నారు. అనారోగ్యంతో సీతారాం గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామాలు, మండల కేంద్రాల కూడళ్లలో ఆయన చిత్రపటాలకు పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. – సాక్షి, నెట్‌వర్క్



మంచాల: ఆరుట్లలో.. సీపీఎం నాయకులు



తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిలో..

నేడు ఏవీఎన్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

ఇబ్రహీంపట్నం రూరల్: రాందాస్‌పల్లి సమీపంలోని ఏవీఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక విభాగాల నుంచి విద్యార్థులను సాంకేతిక నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యాలను ప్రదర్శించడానికి కలిపే గొప్ప వేదిక అని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐజెన్ ల్యాబ్స్ ఎల్ఎల్‌పీ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ కొదండా హాజరవుతారని పేర్కొన్నారు.

తపస్ మండల అధ్యక్షుడిగా రావుల

మంచాల: తపస్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా మంచాల గ్రామానికి చెందిన రావుల శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా రవిందర్‌రావును ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తామని, విద్యా రంగంలో మార్పుల కోసం కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఉదారి నర్సింహ, మండల బాధ్యులు వెంకటేశ్వర్‌రావు, మోహన్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

తుర్కయంజాల్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరమని మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య అన్నారు. శుక్రవారం కమ్మగూడలో ఆరోగ్యమ్మ, ప్రవీణ్, రాజశేఖర్, సుధలకు ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రావు, వెంకటేశ్ యాదవ్, గోని రాము గౌడ్, సురేష్, మహేశ్ ఉన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీటీసీ కౌన్సిలర్ లింగయ్య

ఆమనగల్లు: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కల్వకుర్తి కమ్యూనిటీ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.లింగయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎంఆర్‌డీఎస్ 2 ఎన్‌జీఓ నిర్వాహకురాలు వాణి, పద్మతో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు మార్గాల ద్వారా వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధి సోకిన వారితో శారీరకంగా కలవడం, హెచ్ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీలు వాడటం ద్వారా, హెచ్ఐవీతో కలుషితమైన రక్తాన్ని మరొకరికి ఎక్కించడం వలన, వ్యాధి సోకిన తల్లి నుంచి బిడ్డకు సంక్రమిస్తుందని వివరించారు. ఎవరికైనా అనుమానం ఉంటే సీహెచ్‌సీ ఐసీటీసీ సెంటర్‌లో రక్తపరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వ్యక్తిని ముట్టుకోవడం, ఒకే ఇంట్లో ఉండటం ద్వారా హెచ్ఐవీ సోకదని స్పష్టంచేశారు. వ్యాధి సోకిన వారిపట్ల వివక్ష చూపకుండా సానుభూతితో ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌డీఎస్ 2 ఎన్‌జీఓ నిర్వాహకురాలు వాణి, పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావ్, లెక్చరర్లు, పర్వతాలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హి సేవ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో 'స్వచ్ఛతా హి సేవ 2024' పోస్టర్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 'స్వచ్ఛ సర్వేక్షన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి, స్వయం శుభ్రత పాటించాలని వివరించనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో రక్షణ కరువు

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో ప్రజలకు రక్షణ కరువైందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ ఆరోపించారు. ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి నిరసనగా.. శుక్రవారం ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి, 9 నెలలు గడిచినా వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. ప్రజల దృష్టి మరలించడానికి రేవంత్‌రెడ్డి.. పార్టీల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతలపై దాడులు చేయించడంతో పాటు.. ప్రశ్నిస్తున్న వారిని అరెస్టు చేయిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు ఎంగలి రఘు, నిరంజన్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, బాలస్వామి, పంతునాయక్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, రమేశ్, యాదయ్య, పరమేశ్, గణేశ్, భాస్కర్, శివకుమార్, ప్రసాద్, ఆనంద్, గణేశ్ తదితరులు ఉన్నారు.